క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: గోసాల గ్రామంలో విద్యుత్ సరఫరాకు మంగళవారం అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఈఈ ఆపరేషన్స్ హరిబాబు తెలిపారు. ఆయన సోమవారం వివరాలు తెలుపుతూ.. గోసాల గ్రామంలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 8 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. దీని కారణంగా గోసాల సాయినగర్ కట్ట, చింతల కట్ట, గోసాల గ్రామంలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామన్నారు.

హనుమాన్‌జంక్షన్ పరిధిలో..

హనుమాన్‌జంక్షన్‌రూరల్: హనుమాన్‌జంక్షన్ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీ సీపీడీసీఎల్ గుడివాడ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.రామకృష్ణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. హనుమాన్‌జంక్షన్ సెక్షన్ పరిధిలోని హనుమాన్ నగర్, వేలేరు రోడ్డు, రాజుల కాలనీ, కేఎస్ టాకీస్, విజయవాడరోడ్డులో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

ముమ్మరంగా కులగణన



గన్నవరంరూరల్: మండలంలోని గ్రామాల్లో కులగణన ముమ్మరంగా కొనసాగుతోంది. ఈ నెల 19 నుంచి 28వ తేదీ వరకు టైమ్‌లైన్ పూర్తి కాగా ఇంకా మిగిలిన వారి కోసం వచ్చే నెల 2 వరకు సర్వే గడువును పొడిగించారు. సర్వే పూర్తి చేసేందుకు సచివాలయం సిబ్బంది, వలంటీర్లు కృషి చేస్తున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉంగుటూరు: మానికొండలో గోగినేని పిచ్చయ్య చౌదరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1983–84 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆహ్లాదకర వాతావరణంలో సోమవారం జరిగింది. 40 సంవత్సరాల తరువాత కలుసుకున్న మిత్రులందరూ తాము పాఠశాలలో చదువుకునే రోజులను నెమరవేసుకున్నారు. పూర్వ ఉపాధ్యాయులైన అమరలింగేశ్వరరావు, పార్వతి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం బీరువాను హెచ్‌ఎం శివరామకృష్ణకు అందజేశారు. పూర్వ విద్యార్థులు షేక్ అజీత్ తాతారావు, పెదపూడి నాంచారయ్య, వట్టికూటి కిషోర్ పాల్గొన్నారు.

వైభవంగా సాయిబాబా మందిర వార్షికోత్సవం

ఉంగుటూరు: మండలంలోని ఇందుపల్లిలో వేం చేసి ఉన్న షిరిడీ సాయిబాబా, విఘ్నేశ్వర, దత్తాత్రేయ స్వామివార్ల ఆలయం 23వ వార్షికోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యుడు వక్కలగడ్డ రామచంద్రరావు నేతృత్వంలో పూజా కార్యక్రమాలు జరిపారు. సోమవారం తెల్లవారు జామున 4 గంటలకు విఘ్నేశ్వర స్వామి పూజ, పుణ్యాహవచనం, 100 లీటర్లతో క్షీరాభిషేకం చేశారు. ధుని పూజ, సహస్రనామ పూజ, భజన, విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి, బాబా వారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం మేళతాళాలతో గ్రామ వీధుల్లో బాబా వారి ఊరేగింపు వైభవంగా జరిగింది.

పోలీస్ స్పందనలో 116 ఫిర్యాదులు

విజయవాడస్పోర్ట్స్: జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో సోమవారం జరిగిన స్పందనలో 116 ఫిర్యాదు అందినట్లు డెప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్(డీసీపీ) వి.అజిత తెలిపారు. కమిషనరేట్ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె ఫిర్యాదులు స్వీకరించారు. నగదు లావాదేవీలపై 29, కుటుంబ కలహాలపై 18, ఆస్తి వివాదాలపై 14, మోసాలపై 16, ఇతర అంశాలపై 39 మంది తనకు ఫిర్యాదులు ఇచ్చినట్లు చెప్పారు. ఈ ఫిర్యాదులను నిర్ణీత కాల వ్యవధిలో పరిష్కరించాలని ఆయా స్టేషన్ల అధికారులకు ఆమె ఆదేశాలిచ్చారు.

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం

విజయవాడస్పోర్ట్స్: అనారోగ్యానికి గురై మరణించిన హోంగార్డు డొక్కు వెంకటేశ్వరరావు కుటుంబానికి పోలీస్ కమిషనరేట్ పరిధిలోని హోంగార్డులు ఆర్థికసాయం అందజేశారు. హోంగార్డులు అందరూ కలిసి ఒక్క రోజు వేతనాన్ని ఆ కుటుంబానికి అందించారు. మొత్తం రూ.5 లక్షల చెక్కును పోలీస్ కమిషనర్ టి.కె.రాణా చేతుల మీదుగా మృతుని కుటుంబ సభ్యులకు ఆర్ఐ శ్రీకృష్ణ సమక్షంలో సోమవారం అందించారు.

ముగిసిన నియోజకవర్గ స్థాయి క్రీడా సంబరాలు



క్రికెట్ విజేత గన్నవరం మండలం జట్టు



కబడ్డీ విజేత గన్నవరం మండలం జట్టు

- హోరాహోరీగా జరిగిన ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు
- ఉత్సాహంగా పాల్గొన్న క్రీడాకారులు

గన్నవరం: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా సంబరాలు సోమవారం ఘనంగా ముగిశాయి. గన్నవరం ఎంపీపీ అనగాని రవి అధ్యక్షతన బహుమతుల ప్రధానోత్సవం నిర్వహించారు. క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీల్లో మొదటి మూడు స్థానాలు సాధించిన పురుషులు, మహిళల జట్లకు వరుసగా రూ.35 వేలు, రూ.15 వేలు, రూ.5 వేలు నగదు బహుమతులు, షీల్డ్స్, మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. బ్యాడ్మింటన్ డబుల్స్‌లో వరుసగా మూడు స్థానాల్లో నిలిచిన పురుషులు, మహిళల జట్లకు వరుసగా రూ.20 వేలు, రూ.10 వేలు, రూ. 5 వేలు చొప్పున బహుమతులను ప్రజాప్రతినిధులు చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేశారు.

అధికారులకు అభినందనలు ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ.. ప్రతిభవంతులైన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, పీఈటీలు అందరూ సమన్వయంతో ఈ పోటీలను పండుగ వాతావరణంలో నిర్వహించామన్నారు. మండల, నియోజకవర్గ స్థాయిలో పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు ఉచిత భోజన వసతి కల్పించారు. ఇదే స్ఫూర్తితో జిల్లా స్థాయిలో గన్నవరంలో జరగనున్న కబడ్డీ, బ్యాడ్మింటన్ పోటీలను కూడా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇప్పటి వరకు పోటీలు విజయవంతంగా జరిగేందుకు సహకరించిన ప్రభుత్వంతో పాటు స్పాన్సర్స్, అధికారులు, సిబ్బందికి అభినందనలు తెలియజేశారు. ఎంపీపీలు చెన్ను ప్రసన్నకుమారి, వడ్లమూడి సరోజిని, యర్రగొర్ల నగేష్, జెడ్పీటీసీలు కాకర్లమూడి సువర్ణరాజు, కొమరవల్లి గంగాభవాని, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ.గౌసాని, సర్పంచి నిడమర్తి సౌజన్య, ఎంపీటీసీ సభ్యులు గూటాల భాగ్యరాజు, మండల కో ఆప్షన్ సభ్యుడు ఎస్‌కె.కరిముల్లా, ప్రత్యేకాధికారి మహ్మద్ హాజీబేగ్, ఎంపీడీఓలు ఈ.సత్యకుమార్, శేషగిరిరావు, ఈఓపీఆర్డీ పి.వెంకటేశ్వరమ్మ, కేవీఆర్ స్పోర్ట్స్ అధ్యక్షుడు కేవీఆర్.కిషోర్, క్రీడా సమన్వయకర్త డి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ విజేత పెనమలూరు జట్టు

పెనమలూరు: ఆడుదాం ఆంధ్రా క్రికెట్ పోటీల్లో పెనమలూరు సచివాలయం-2 విజేతగా నిలిచింది. ఎంపీడీఓ సునీతాశర్మ తెలిపిన వివరాల ప్రకారం.. కానూరు వీఆర్ సిద్దార్థ ఇంజినీరింగ్ కాలేజ్ మైదానంలో సోమవారం పెనమలూరు-2 సచివాలయం, ఉయ్యూరు జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరిగింది. పోటీలో పెనమలూరు జట్టు నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానం పొంది జిల్లా పోటీలకు అర్హత సాధించింది. కార్యక్రమంలో తహసీల్దార్ కట్టా వెంకట శివయ్య, సీఐ టీవీవీ రామారావు, ఏఓ లోయ శివశంకర్‌రావు, ఈఓఆర్డీ కోరా శ్రీనివాసరావు, పలువురు అధికారులు పాల్గొన్నారు. కాగా క్రికెట్ ఫైనల్ పోటీపై ఉయ్యూరు జట్టు ఆటగాళ్లు చేసిన ఫిర్యాదుపై పరిశీలిస్తున్నామని అధికారులు తెలిపారు.



విజేతగా నిలిచిన పెనమలూరు జట్టు

అంకితభావంతో పనిచేసే వారికి గుర్తింపు



రవికుమార్‌ను సన్మానిస్తున్న చైర్‌పర్సన్ కరుణ, పాలకవర్గ సభ్యులు

గన్నవరం: అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు సమాజంలో గుర్తింపు లభిస్తుందని ఏఎంసీ చైర్‌పర్సన్ తోట కరుణ పేర్కొన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో సూపర్‌వైజర్‌గా పనిచేసి పదోన్నతిపై బదిలీ అయిన ఎంవీ.రవికుమార్‌ను ఏఎంసీ పాలవకర్గంతో పాటు అధికారులు, సిబ్బంది సత్కరించారు. ఈ సందర్భంగా కరుణ మాట్లాడుతూ.. వ్యవసాయ మార్కెట్ యార్డు ద్వారా రైతులకు సేవలందించడంలో ఉద్యోగుల పాత్ర కీలకమన్నారు. అటువంటి బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తించిన రవికుమార్ అందరి మన్ననలు అందుకున్నారని చెప్పారు. ఇదే స్ఫూర్తితో పనిచేయడం ద్వారా భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులను అలంకరించాలని ఆకాంక్షించారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య, సర్పంచి నిడమర్తి సౌజన్య, ఏఎంసీ గ్రేడ్ – 1, 3 కార్యదర్శులు ఏ.కిషోర్, పి.జ్యోతి, పలువురు పాలకవర్గ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

రబీ రెడీ



నాట్లకు అనువుగా పొలాన్ని దమ్ము చేస్తున్న ట్రాక్టరు

- దాదాపు పూర్తయిన ఖరీఫ్ సాగు పనులు
- రబీ సాగులో నిమగ్నమైన అన్నదాతలు
- జిల్లా వ్యాప్తంగా ఊపందుకున్న వ్యవసాయ పనులు

కంకిపాడు(పెనమలూరు): ఖరీఫ్ సీజన్ తుదిదశకు చేరింది. దీంతో అన్నదాతలు రబీ పనుల్లో నిమగ్నమవుతున్నారు. ప్రధానంగా వరి, అపరాలు, మొక్కజొన్న ఇతర ప్రధాన పంటలను సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. రబీలో అనువైన విత్తన రకాలను ఎంపిక చేసుకుని సాగును ముమ్మరం చేశారు. కృష్ణాజిల్లా వ్యాప్తంగా రైతులు, కూలీలు రబీ సాగులో బిజీ అయ్యారు.

చివరి దశలో ఖరీఫ్

ఈ ఖరీఫ్ సీజన్ చివరలో ఉంది. ఈ సీజన్‌లో 3.69 లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ప్రస్తుతం 20 శాతం పంట ఇంకా కుప్పల మీద ఉంది. కుప్ప నూర్పిడి మినహా సాగు పనులు దాదాపుగా పూర్తయినట్లే. నూర్పిడి పూర్తయిన చోట్ల ఆర్‌బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు చేసేందుకు జిల్లా యంత్రాంగం సమర్థంగా పనిచేస్తోంది.

సాగు పనుల్లో నిమగ్నం

ఖరీఫ్ ముగింపునకు చేరుకోవడంతో రైతులు రబీ సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. జిల్లా వ్యాప్తంగా 1,60,901 హెక్టార్లు సాధారణ విస్తీర్ణం కాగా ఇప్పటికే 1,07,062 హెక్టార్లలో సాగు పూర్తయింది. అపరాలు దిగుబడి రాని పొలాల్లో మాత్రం రైతులు వరి సాగుకు ఉపక్రమించారు. ఇప్పటికే అనువైన విత్తన రకాలతో నారుమడులు పోసుకున్నారు. వరి నారు నాట్లకు సిద్ధం కావటంతో పొలాలను దమ్ము ట్రాక్టర్లతో దమ్ము చేసి నాట్లు వేసే పనులు చేపడుతున్నారు. దీంతో పాటుగా మినుము, పెసర, వేరుశనగ, శనగ, మొక్కజొన్న పైర్లను సాగు చేస్తున్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం

ఖరీఫ్ సీజన్‌లో పంట చేతికొచ్చే తరుణంలో మిచాంగ్ తుపాను విరుచుకుపడింది. తుపానుతో కృష్ణాజిల్లాలోని ఆయా మండలాల్లో 59,297.98 హెక్టార్లలో పంట నష్టం వాటిల్లిందని అధికారులు లెక్కతేల్చారు. 93,527 మంది రైతులు నష్టపోయారని నిర్ధారించారు. రూ.101.02 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల కావాలని నివేదికలో పొందుపర్చారు. ఈ క్రమంలో రెండో పంట సాగుకు ప్రభుత్వం చేయూత అందించింది. మినుము 8,500 క్వింటాళ్లు, పెసర 400 క్వింటాళ్లు, వేరుశనగ 350 క్వింటాళ్లు, శనగ 10 క్వింటాళ్ల చొప్పున విత్తనాలను సబ్సిడీపై అందించింది. జిల్లా వ్యాప్తంగా రూ.4.45 కోట్ల మేర సబ్సిడీ విత్తనాలను రైతులకు అందించి సాగుకు ఊతం అందించింది. రైతులు, కూలీలు సస్యరక్షణ చర్యలు చేపడుతున్నారు.



కంకిపాడులో నాట్లకు సిద్ధమైన వరి నారుమడి

గత సీజన్‌లో మినుము, పెసర, మొక్కజొన్న పంటల దిగుబడులు ఆశాజనకంగా ఉండటంతో పాటుగా మార్కెట్‌లో ధర పలకటంతో రైతులు ఈ సీజన్‌లోనూ అపరాలు, మొక్కజొన్న, ఇతర పంటల వైపు దృష్టి పెట్టారు.

సాగుకు చేయూత



రబీ సాగుకు అవసరమైన చేయూత అందించాం. ప్రభుత్వం సాధారణంగా ఇచ్చే 30 శాతం సబ్సిడీతో పాటు, మిచాంగ్ విపత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం 80 శాతం సబ్సిడీ వర్తింప చేసి రైతులను ఆదుకుంది. అనువైన విత్తన రకాల ఎంపికపై రైతులకు సూచనలు అందించాం. సస్యరక్షణ చర్యలపై ఆర్‌బీకే స్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం.

– ఎస్.పద్మావతి, జిల్లా వ్యవసాయాధికారి, కృష్ణాజిల్లా

ధ్యానంతో మానసిక ప్రశాంతత



బీబీ గూడెంలో మెడిటేషన్ ప్రయోజనాలను వివరిస్తున్న నాగ రమాదేవి

గన్నవరంరూరల్: ధ్యానంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని పత్రీజీ ధ్యాన కేంద్రం సీనియర్ ట్రైనర్ నాగ రమాదేవి పేర్కొన్నారు. మండలంలోని బీబీ గూడెం గ్రామంలో సోమవారం గ్రామస్తులకు మెడిటేషన్ చేయటం ద్వారా కలిగే ప్రయోజనాలను ఆమె వివరించారు. శ్వాసపై ధ్యాసను కేంద్రీకరించటం ద్వారా అనేక రుగ్మతలను దూరం చేయవచ్చన్నారు. ధ్యానంతో ప్రతి ఒక్కరూ తమ వ్యక్తిగత జీవనంపై పట్టు సాధించి ఆరోగ్యవంతులు కావటంతో పాటు వారి ఆయుష్షు పెరుగుతుందని చెప్పారు. పలువురు సీనియర్ పిరమిడ్ ట్రైనర్లు పాల్గొని ధ్యానం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.

తెలుగు సాహిత్యపు రాచబాట వేటూరి పాట

విజయవాడ కల్చరల్: తెలుగు సాహిత్యపు రాచబాట వేటూరి పాట అని వేద గంగోత్రి వ్యవస్థాపకుడు డాక్టర్ వరప్రసాద్ అన్నారు. వేటూరి సాహితీ మిత్రులు ఆధ్వర్యంలో తుమ్మలపల్లి కళాక్షేత్రంలోని వేటూరి విగ్రహం వద్ద సోమవారం సినీ గేయ రచయిత వేటూరి సుందరరామ మూర్తి జయంతిని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వరప్రసాద్ మాట్లాడుతూ.. నేటి తరం రచయితలు వేటూరి సాహిత్యాన్ని అధ్యయనం చేయాలని సూచించారు. పోలవరపు కోటేశ్వరరావు సాహితీపీఠం వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు, సినీ మాటల రచయిత బుర్రా సాయిమాధవ్, వేటూరి పాటల సాహిత్య పరిశోధకుడు డాక్టర్ జయంతి చక్రవర్తి, దామోదర గణపతిరావు, ప్రభల శ్రీనివాస్, చింతకాయల చిట్టిబాబు, బోడి ఆంజనేయరాజు, కారుమంచి రాజు, డాక్టర్ కానుకొల్లు బాలకృష్ణ, దండు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అల్పాహారం పంపిణీ ప్రారంభం

ఉయ్యూరు: భావితరాల భవిష్యత్తుకు జగనన్నే మళ్లీ సీఎం కావాలని రక్ష ఫౌండేషన్ చైర్మన్, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పడమట స్నిగ్ధ అన్నారు. రక్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉయ్యూరు జెడ్పీ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం అల్పాహారం పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా పడమట స్నిగ్ధ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ పాఠశాల రూపురేఖలు మార్చేసి పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందుబాటులోకి తెచ్చారన్నారు. పేదరిక నిర్మూలన ఒక్క విద్యతోనే సాధ్యమని సీఎం జగనన్న చదువునే ఆస్తిగా అందిస్తున్నారని చెప్పారు. పదో తరగతి విద్యార్థులకు ఉయ్యూరు జెడ్పీ పాఠశాలలో 40 రోజుల పాటు అల్పాహారం పంపిణీ చేసి జగనన్న ఆలోచనకు అనుగుణంగా విద్యాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసరావు, రక్ష ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పడమట సురేష్ బాబు, ప్రతినిధులు కొండేటి సుబ్బారావు, వీరంకి కోటయ్య తదితరులు పాల్గొన్నారు.



ఉయ్యూరులో అల్పాహారం పంపిణీ చేస్తున్న పడమట స్నిగ్ధ, సురేష్ బాబు

'మంచి చేసింది మేమే.. వచ్చేది మా ప్రభుత్వమే'

- కౌన్సిల్ సమావేశంలో వైఎస్సార్ సీపీ సభ్యులు

ఉయ్యూరు: 'మా ప్రభుత్వంలోనే ప్రజలకు మంచి జరిగింది. మా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాజకీయాలకతీతంగా పథకాలు అందించారు. అభివృద్ధి చేశారు. టిడ్కో ఇళ్లు కూడా మేమే ఇస్తున్నాం. మంచి చేసింది మేమే.. వచ్చేది మా ప్రభుత్వమే.' అని కౌన్సిల్ సమావేశంలో వైఎస్సార్ సీపీ సభ్యులు స్పష్టం చేశారు. ఉయ్యూరు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ, బడ్జెట్ సమావేశం సోమవారం జరిగింది. చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో టిడ్కో గృహాల సమస్యపై అధికార ప్రతిపక్ష సభ్యుల మధ్య వాడీవేడి చర్చ జరిగింది. టీడీపీ కౌన్సిలర్ సుధారాణి వచ్చే మా ప్రభుత్వంలో టిడ్కో ఇళ్లు ఇస్తామంటూ చేసిన వ్యాఖ్యలపై వైఎస్సార్ సీపీ సభ్యులు అభ్యంతరం తెలిపారు. కౌన్సిలర్ రాజుల పాటి చిన్ని సుధారాణి వ్యాఖ్యలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వచ్చేది మా ప్రభుత్వమే, చేసేది మా జగనన్నే, పగటి కలలు కనొద్దు అంటూ ధ్వజమెత్తారు. వైస్ చైర్మన్లు షోలే సురేష్ బాబు, హర్షతునిసా బేగం, గోన మదన్, గుంజా సుధాకర్, తదితరులు టీడీపీ కౌన్సిలర్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో సమావేశం వాడీవేడిగా ముగిసింది. 2024– 25 ఆర్థిక సంవత్సరానికి రూ.37.07 కోట్ల ఆదాయం సమకూరుతుందని, రూ.34.32 కోట్ల ప్రజల మౌలిక వసతులు కల్పనకు కేటాయిస్తున్నట్లు పేర్కొంటూ బడ్జెట్‌ను సభ్యులు ఆమోదించారు.



కౌన్సిల్‌లో టీడీపీ సభ్యుల వ్యాఖ్యలకు నిరసన తెలుపుతున్న వైఎస్సార్ సీపీ సభ్యులు

బైక్‌లు ఢీ : ఇద్దరికి గాయాలు

పెనమలూరు: విజయవాడ – అవనిగడ్డ కరకట్టపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయాలపాలయ్యారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పటమట రామలింగేశ్వర నగర్‌కు చెందిన కె.భానుప్రసాద్, అతని మిత్రుడు హేమంత్ బైక్‌పై ఆదివారం కరకట్టపై వెళ్తుండగా ఎదురుగా వచ్చిన మరో బైక్ వీరిని ఢీ కొట్టింది. ఈ ఘటనలో భానుప్రకాష్, హేమంత్‌కు గాయాలయ్యాయి. ఘటనపై భానుప్రకాష్ తండ్రి సుందరరావు ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం



విజయవాడరూరల్: గణతంత్ర వేడుకల్లో ప్రభుత్వం నుంచి ఉత్తమ అధికారులుగా అవార్డులు పొందిన ఎంపీడీఓ బి.భార్గవి, (పీఆర్) అసిస్టెంట్ ఇంజినీర్ ఎస్.శివరామకృష్ణ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ బి.షణ్ముఖలను మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సన్మానించారు. వారి సేవలను ప్రజాప్రతినిధులు, నాయకులు కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ చెన్ను ప్రసన్న కుమారి, జెడ్పీటీసీ కె.సువర్ణరాజు, కందిమళ్ల రామాంజనేయులు, కలపాల అబ్రహాం, వీరమాచినేని వెంకటేశ్వరప్రసాద్, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

మున్సిపల్ కమిషనర్ బాధ్యతల స్వీకరణ

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీకి కొత్త కమిషనర్‌గా ఎం.వెంకటేశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన కమిషనర్ ఎస్.ప్రకాశరావు బదిలీపై మంగళగిరి–తాడేపల్లి అదనపు కమిషనర్‌గా వెళ్లారు. ఆయన స్థానంలో ఒంగోలు మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఎం.వెంకటేశ్వరరావును తాడిగడప మున్సిపల్ కమిషనర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో తాడిగడప కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్‌ను పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు కలిసి అభినందనలు తెలిపారు.



వెంకటేశ్వరరావుకు మొక్క అందజేస్తున్న సిద్ధిఖ్